## క్లుప్తంగా

### పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారంతో గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. మంత్రి ఆర్కేరోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వాస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ చేస్తారు. ఇందులో భాగంగా పౌష్టికాహారం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, వైఎస్సార్ సీపీ నాయకులు కుట్టి, చిన్నా, బుజ్జి, చిరంజీవి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నారాయణస్వామి, పుష్పమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో 11 గొర్రె పిల్లల మృతి



మృతి చెందిన గొర్రెల పిల్లలు

వెదురుకుప్పం: వీధి కుక్కల దాడిలో 11 గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లెలో బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నడిపిరెడ్డి గొర్రెల పెంపకంతో జీవనాన్ని సాగిస్తున్నాడు. బుధవారం గొర్రె పిల్లలను దొడ్డిలో ఉంచి, గొర్రెలను మేత కోసం తీసుకెళ్లారు. వీధి కుక్కలు దొడ్డిలోకి ప్రవేశించి గొర్రె పిల్లలపై దాడి చేశాయి. నడిపిరెడ్డి మధ్యాహ్నం భోజనం కోసం వచ్చి చూసేసరికి 11 గొర్రె పిల్లలు చనిపోయి ఉన్నాయి.

### నిధులు మంజూరు

గంగాధరనెల్లూరు: అభివృద్ధి పనులకు రూ.3.92 కోట్ల నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్‌శాఖ డీఈ దయాకర్‌రెడ్డి తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కరించడ కోసం గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వంద పనులు చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయన్నారు. సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, అసంపూర్తిగా నిలిచిపోయిన పంచాయతీ భవనాలు, కల్వర్టులు, వంతెన నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

### జోరుగా అభివృద్ధి పనులు



బాలింతలతో మాట్లాడుతున్న కమిషనర్

పుత్తూరురూరల్: పట్టణంలో అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి తెలిపారు. 24వ వార్డు కాపు వీధిలో 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.17 లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పనులు వేగవంతం చేసి, త్వరతగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. అనంతరం కామరాజునగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. బాలింతలు, పిల్లలకు అందజేసే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. పౌష్టికారం పంపిణీపై బాలింతలను ఆరా తీశారు. సాయంత్రం పార్క్‌లోని మొక్కలకు నీటి సరఫరా పనులను పరిశీలించారు. పార్క్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.

### ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

నింద్ర: మండలంలోని రైతులు తాము సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ మురళీకృష్ణ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ నెల 28 తేదీ లోపు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు.

### పనిముట్ల వితరణ



పనిముట్లు అందజేస్తున్న జీబీ అన్బళగన్

నగరి: పట్టణానికి చెందిన పలువురు ఓంశక్తి భక్తులకు బుధవారం జీబీ అన్బళగన్ పనిముట్లు వితరణ చేశారు. మేల్‌మరువత్తూరులో జరిగిన అడిగళార్ కుమారుడు శక్తి జీబీ అన్బళగన్ జన్మదిన వేడుకలకు ఓంశక్తి భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగరి ఆధ్యాత్మిక ప్రజాసేవ ఉద్యమానికి చెందిన ఐదుగురికి సైకిళ్లు, ఐదుగురుకి టీక్యాన్లు, ఐదుగురు మహిళలకు కుట్టుమిషన్లు, ముగ్గురు విద్యార్థులకు అభ్యసనా సామగ్రి అందజేశారు.

### రెడ్డిగుంట పరిశీలన

నింద్ర: మండల కేంద్రంలోని రెడ్డిగుంటను అభివృద్ధి చేయడానికి అధికారులు ఆ గుంటను బుధవారం అధికారులు పరిశీలించారు. ఉపాధి ఏపీఓ ఇందుమతి మాట్లాడుతూ రెడ్డిగుంటను అభివృద్ధి చేస్తామన్నారు. సర్పంచ్ వసంత, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, వార్డు సభ్యుడు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

### ప్రమాణాలు పాటించాలి

నింద్ర: ఉపాధి హామీ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీడీ శోభన్‌బాబు అన్నారు. బుధవారం రాజుగుంటలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఆయన మట్లాడుతూ కూలీలందరికీ పని కల్పిస్తామన్నారు. ఏపీఓ ఇందుమతి పాల్గొన్నారు.

# పంట నమోదు.. పలు ప్రయోజనాలు

రాయితీలు.. నష్టపరిహారం..వైఎస్సార్ రైతు భరోసా తదితర అన్ని ప్రయోజనాలు పొందడానికి ఈ–క్రాప్ నమోదు ఎంతో కీలకం. బ్యాంకర్ల నుంచి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మేరకు రైతులు పంట రుణం పొందడానికి పంట నమోదు దోహదం చేస్తుంది. ఇలా పలు ప్రయోజనాలను పొందడానికి ఈ ప్రక్రియ ఉపయోగ పడుతోంది.

- నియోజకవర్గంలో ఇప్పటివరకు 80.4 శాతం పూర్తి
- నమోదుకు ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం



వేలావడిలో పంట నమోదు చేస్తున్న అధికారులు

నగరి: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ–క్రాప్ విధానాన్ని అమలు చేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో పాటు, పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. కరువు, అధిక వర్షాలతో పంట నష్టపోయినప్పుడు పరిహారం అందిస్తోంది. రైతులకు ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ–క్రాప్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి.

**పంట నమోదు వివరాలు**

నగరి నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 8,015 మంది రైతులు సుమారు 14,323 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేశారు. రైతులు ప్రధానంగా వరి, వేరుశనగ, చెరుకు, పొద్దుతిరుగుడు, కూరగాయలు సాగు చేస్తున్నారు. ఈ పంటల్లో ఇప్పటివరకు 10,392 ఎకరాల పంటను నమోదు చేశారు. నియోజకవర్గంలో వ్యవసాయశాఖ సిబ్బంది 80.4 శాతం ఈ–క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ పూర్తి చేశారు. ఈనెల 28వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ఈ–క్రాప్‌తో పాటు ఈకేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఈ–క్రాప్ నమోదు ఇలా..**

వ్యవసాయశాఖ సిబ్బంది ఈ–కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు, పంటలసాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట రైతు భరోసా కేంద్రాల్లో రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ–కేవైసీ నమోదు చేయించాలి. ఇలా ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, పంటల బీమా, పంట నష్టపరిహారం, పంటల గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగు మందులు తదితరాలు రాయితీపై అందుతాయి. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ–కేవైసీ కూడా చేయించుకోవాలి. అప్పుడే పథకాలు పొందడంలో ఎలాంటి సమస్యలుండవు.

**మండలాల వారీగా పంట నమోదు శాతం**

| మండలం | రైతులు | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) | ఈకేవైసీ విస్తీర్ణం | నమోదు శాతం |
|---|---|---|---|---|
| నగరి | 1,293 | 2,711 | 1,712 | 63 |
| పుత్తూరు | 543 | 1,743 | 1,743 | 100 |
| నింద్ర | 2,200 | 1,900 | 1,750 | 92 |
| విజయపురం | 964 | 2,469 | 2,366 | 96 |
| వడమాలపేట | 3,015 | 5,500 | 2,821 | 51 |
| మొత్తం | 8,015 | 1,4323 | 10,392 | 80.4 |

**వందశాతం నమోదుకు కృషి**



పంట నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాం. రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయ సిబ్బంది పంట నమోదు చేసిన ప్రతి రైతు కూడా తప్పనిసరిగా రబీ పంట ఈకేవైసీ ఈ నెల 28వ తేదీ లోపు చేసుకోవాలి. ఈకేవైసీతోపాటు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి.

–రాఘవేంద్ర యాదవ్, వ్యవసాయ అధికారి, నగరి మండలం

## సామాజిక సమన్యాయం జగనన్నతోనే సాధ్యం



హర్షం వ్యక్తం చేస్తున్న వన్నెకుల క్షత్రియులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): సామాజిక న్యాయం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వన్య కులస్తులతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ రాజకీయంగా అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా వన్నెకుల క్షత్రియులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం హర్షించ దగ్గ విషయమన్నారు. 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ఎన్నడూ వారిని గుర్తించ లేదన్నారు. ఏఎంసీ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి రాజకీయ ఎదుగుదలకు ఊతమిచ్చిన సీఎం జగనన్నకు వన్నెకుల క్షత్రీయులు ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూదిమోహన్, విజయకుమార్‌రెడ్డి, ఎస్సీసెల్ నేత దాము, మునికృష్ణారెడ్డి, యతీశ్వర్‌నాయుడు, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమ సారథి సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న శివప్రకాష్ రాజు

పాలసముద్రం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీసీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ అన్నారు. బుధవారం పాలసముద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలో ఎన్నడూ చేయని విధంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గోవర్ధనాదీశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, వనదుర్గాపురం, టీవీఎన్‌ఆర్ పురం గ్రామానికి అటవీశాఖ అనుమతులు పొంది, రోడ్డు పనులు చేస్తున్నారని చెప్పారు. మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతుండడం చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో బలిజకండ్రిగ, రామకృష్ణాపురం, వీర్లగుడి గ్రామానికి రోడ్డు పనులు చేయకుండానే రోడ్డు పనులు పూర్తి చేసినట్లు రిబ్బన్ కట్ చేసి, ప్రారంభోత్సవాలు చేశారని ఆరోపించారు. అలాంటి పనులు తాము చేయమన్నారు. కుల, మతాల పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. జీడీ నెల్లూరు బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డీ వేణు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొమ్మిది మంది బీసీలకు టికెట్లు ఇచ్చారన్నారు. అందులో వడ్డెరులకు కూడా ఒక ఎమ్మెల్సీ సీటు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసియాదవ్, ఎంపీటీసీ సభ్యులు గోవిందరాజు, ఆర్బీకే చైర్మన్ పోలయ్య, సర్పంచ్ అయ్యప్ప, నాయకులు షణ్ముగరెడ్డి, త్యాగరాజ్, ప్రకాష్, మనోహర్, బాల బోయడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుధాకరరావు

వెదురుకుప్పం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు మంజూరైన పక్కాగృహాలను వెంటనే పూర్తి చేయించాలని హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం వెదురుకుప్పంలో అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు పూర్తి చేసి, ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలన్నారు. ఎంపీడీఓ సుధాకరరావు మాట్లాడుతూ మండలంలో పక్కాఇళ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. పూర్తి చేసిన గృహాలకు వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. సచివాలయ సిబ్బంది గృహ నిర్మాణాల విషయంలో అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పురుషోత్తం, ఏపీఎం కవిత, ఏపీఓ ఇందు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం ఎమ్మార్పీకే విక్రయించాలి

పాలసముద్రం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని చిత్తూరు మద్యం డిపో ఎక్సైజ్ రామకృష్ణశాస్త్రి తెలిపారు. బుధవారం మండలంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత నిబంధనల మేరకు మద్యం విక్రయించాలన్నారు. మద్యం విక్రయంపై గ్రామాల్లో ప్రత్యేకంగా నిఘా ఉంచినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు నగదు బ్యాంకులో జమ చేయాలన్నారు. రాత్రివేళ దుకాణాల వద్ద కాపాదారులు తప్పనిసరి అన్నారు. కానిస్టేబుల్ కుమార్, జాన్సన్ పాల్గొన్నారు.

## ఒక మంచి ఆలోచన జీవితాన్నే మార్చేస్తుంది



బహుమతి అందజేస్తున్న కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ఒక మంచి ఆలోచన జీవితాన్నే మార్చేస్తుందని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గేట్‌పుత్తూరులోని స్కాట్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ స్కాట్ అండ్ గైడ్స్‌లో చేరాలన్న ప్రతి విద్యార్థి ఆలోచన ఎంతో గొప్పదన్నారు. చిన్నతనం నుంచి సమాజ సేవ చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని చెప్పారు. స్కాట్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా క్రమశిక్షణతో కూడిన సేవామార్గం అలవడుతుందని తెలిపారు. పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి అందజేసిన బహుమతులను కరోనా సమయంలో సేవలందించిన వారికి పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చై ర్మన్ డి.జయప్రకాష్, పుత్తూరు భారత్ స్కాట్ అండ్ గైడ్స్ తిరుపతి జిల్లా మాస్టర్ ఎ.వెంకటేశ్వర్లు, రోవర్ లీడర్ హేమాద్రి, రేంజర్ లీడర్ భువనేశ్వరి, గైడ్స్ లీడర్స్ మేఘన, చారులత, గీతిక తదితరులు పాల్గొన్నారు.

### నిర్మాణాలు వేగవంతం చేయాలి

వడమాలపేట: కాయం రెవెన్యూ పరిధిలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల హౌసింగ్ ఏఈ వెంకటరత్నం కోరారు. బుధవారం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తుందన్నారు. నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.

### పరీక్షలతో మాతాశిశు మరణాల నివారణ



పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేసుకుంటే మాతాశిశు మరణాల నివారణ సాధ్యమని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో గర్భిణులు మజ్జిగ, పండ్ల రసం, నీరు తీసుకోవాలన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలన్నారు. అనంతరం 35 మంది గర్భిణులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

### డీడీలు సక్రమంగా కట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ బాబు

పాలసముద్రం: చౌక దుకాణ డీలర్లు నిత్యావసర సరుకులకు నిర్ణీత సమయంలో సక్రమంగా డీడీలు కట్టాలని తహసీల్దార్ బాబు డీలర్లకు సూచించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని డీలర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరకులు బియ్యం, పప్పు, పంచదారకు డీడీలు సక్రమంగా కట్టాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో పప్పు, పంచదార ఇవ్వలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటివి జరగకుండా చూడాలన్నారు. నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని సంబంధిత వీఆర్వో క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. డీటీ మధుబాబు, డీలర్లు పాల్గొన్నారు.

### దోమ తెరలు వాడాలి

పాలసముద్రం: ప్రభుత్వ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులు రాత్రి సమయంలో దోమ తెర తప్పకుండా వాడాలని పుత్తూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌బాబు తెలిపారు. బుధవారం ప్రభుత్వ బీసీ బాలికల, బాలుర వసతి గృహన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సీజన్‌లో దోమల కారణంగా పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రి సమయంలో గది కిటికీల నుంచి దోమలు రాకుండా మెస్ కొట్టాలని వార్డెన్లకు సూచించారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాలసముద్రం : మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. బుధవారం మధ్యాహన భోజన విరామంలో కళాశాల ఆవరణలో విద్యార్థులు కలసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, వర్షాలు కురవాలంటే మొక్కలు ఎక్కువగా నాటాలన్నారు.

## గృహసారథులే పార్టీకి విజయసారథులు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: గృహ సారథులే వైఎస్సార్ సీపీకి విజయసారథులని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని ఎస్ఎల్వీ కల్యాణ మండపంలో సచివాలయాల మండల కన్వీనర్ బాల సుబ్రమణ్యంరెడ్డి అధ్యక్షతన సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతు పార్టీ తరుపున నియమించిన గృహసారథుల పనితీరు ఆధారంగా భవిష్యత్‌లో వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ, ప్రభుత్వం అందించే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన మరో వ్యవస్థే సచివాలయ కన్వీనర్లు, గృహసారథులని అన్నారు. ప్రభుత్వ వ్యవస్థలో వారు భాగ్యస్వాములై వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు కృషి చేయాలన్నారు. టీడీపీ అసత్య ఆరోపణలను తిప్పికొట్టాల్సిన బాధ్యత వలంటీర్లు, గృహసారథులపై ఉందన్నారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాల గురించి, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అనంతరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, సర్పంచ్ హరిత, స ర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, నాయకులు విజయబాబు, జనార్దన్, కుప్పయ్య, మణి, కాళప్ప పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : విజయపురం మండలం ఆలపాక కండ్రిగలోని గ్రామ దేవత పడవేటమ్మ ఆలయ నిర్మాణానికి రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయం వద్ద రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, యువజన సర్వీసులు, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా ఆ మొత్తాన్ని ఆ గ్రామస్తులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయపురం మండలం ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిద్దాం



ప్రచారం చేస్తున్న కృపాలక్ష్మి, ఎంపీపీ లత

కార్వేటినగరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపిద్దామని వైఎస్సార్ సీపీ నాయకురాలు కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎంఎం విలాసం పంచాయతీలో ఎంపీపీ లత ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కృపాలక్ష్మి మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన తూర్పు రాయలసీమ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించి, ముఖ్యమంత్రికి కానుకగా అందించాలని కోరారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాల వర్షం కురిపిస్తున్న సీఎం జగనన్నకు ప్రజలు రుణపడి ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ సభ్యుడు పట్నం ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు శేషాద్రి, శేఖర్‌రాజు, పురందర్, చందురాజు, వెంకటరత్నం, ధన్‌రాజ్ పాల్గొన్నారు.

## టాటా ఏస్ బోల్తా .. పలువురికి గాయాలు



గాయపడిన సుబ్రమణ్యం



బోల్తా పడిన వాహనం

వెదురుకుప్పం: మండలంలోని బ్రాహ్మణపల్లె సమీపంలో టాటా ఏస్ బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలుకాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. రామచంద్రాపురం మండలం అనుప్పల్లె గ్రామానికి చెందిన సుమారు 25 మంది తమ బంధువు అంత్యక్రియల నిమిత్తం టాటా ఏస్ వాహనంలో బుధవారం ఉదయం వెదురుకుప్పం మండలం కమ్మకండ్రిగ గ్రామానికి బయలు దేరారు. బ్రాహ్మణపల్లె సమీపంలోని మలుపు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. వాహనంలో ఉన్న 25 మంది ఒకరిపై ఒకరు కింద పడడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో అనుపల్లి గ్రామానికి చెందిన చెంగయ్య(61), చిన్నస్వామి(60), సుబ్రమణ్యం(38), చెంగమ్మ(62), నిర్మల(40), రూపసుందర్‌రెడ్డి(43), వెంకటముని(36), చెంగయ్య(63) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలించారు. రూపసుందర్‌రెడ్డి, వెంకటముని, చెంగయ్య ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు రుయాలో ఉన్నారు. 10 మందికి పైగా స్వల్ప గాయాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు.

## సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకే సాధ్యం



సుబ్రమణ్యంను సన్మానిస్తున్న వన్నెరెడ్డి సంఘం ప్రతినిధులు

పుత్తూరు రూరల్: సామాజిక న్యాయం ఒక వైఎస్సార్ సీపీకే సాధ్యమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించారని నగరి నియోజకవర్గ వన్నెరెడ్డి సంఘం అధ్యక్షుడు ఏఎస్ వెంకటేశన్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిపాయిసుబ్రమణ్యం ఎంపిక ఇందుకు నిదర్శనమన్నారు. బుధవారం సాయంత్రం తిరుపతిలో సిపాయి సుబ్రమణ్యంను కలిసి సంఘం తరఫున సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మురళీరెడ్డి, వెంకటేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మహిళతో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

నగరి: అందరి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుండ్రాజుకుప్పం దళితవాడలో ఆయన పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందే సంక్షేమ పథకాల గురించి, అడిగి తెలుసుకున్నారు. అలాగే అర్హులకు పథకాలు అందడంలో ఏవైనా సమస్యలున్నాయా? ఆరా తీశారు. ప్రతి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఆర్బీకే అధ్యక్షుడు బుజ్జిరెడ్డి, నాయకులు గుణశేఖర్, గోవర్ధన్, జ్ఞానం, ఆనంద్, కుమార్, దయాళు, వెంకటేశులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: ఉపాధిహామీ పథకంలో వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ ఎస్ విద్యావతి తెలిపారు. బుధవారం ఉపాధి హామీ ఏపీఓ బాల, జేఈ అనుషా అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పండ్లతోట పెంపకం, చెరువు కాలువల మరమ్మతు, శ్మశానాలకు రోడ్లు తదితర పనులు పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ముఖ్యంగా కూలీల సంఖ్య పెంచడంతోపాటు పనులు నాణ్యతగా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.